బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 27 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## పోలీస్ శాఖలో భారీ బదలీలు..

బలగం టీవీ, హైదరాబాద్

మరోసారి పోలీస్ శాఖలో పెద్ద ఎత్తున బదలీలు జరిగాయి. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఐడీ ఎస్పీగా ఉన్న ఎస్వీ నాగలక్ష్మిని రాచకొండ సైబర్ క్రైమ్స్ డీసీపీగా, కమాండ్ కంట్రోల్ టెక్నికల్ వింగ్ ఎస్పీగా ఉన్న కె.పుష్పను నార్కోటిక్ కంట్రోల్ సెల్ సూపరింటెండెంట్‌గా, సీఐడీ ఎస్పీగా ఉన్న డాక్టర్ పి లావణ్య నాయక్ జాదవ్‌ను హైదరాబాద్ విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీగా బదలీ చేశారు. అదేవిధంగా అదనపు ఎస్పీ ర్యాంక్‌లో వెయిటింగ్‌లో ఉన్న కె.శంకర్‌ను సీఐడీ అదనపు ఎస్పీగా, ఉపేందర్‌రెడ్డిని అడ్మిన్ ఏఎస్పీగా నిర్మల్‌కు, నిర్మల్ అదనపు ఎస్పీ అడ్మిన్‌గా ఉన్న సూర్యనారాయణను సివిల్‌సప్లై శాఖలో అడిషనల్ ఎస్పీగా, ప్రతాప్‌కుమార్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, శ్రీకృష్ణ గౌడ్‌ను అడిషనల్ డీసీపీ సెంట్రల్ జోన్‌కు, వెంకటేశ్వరబాబును ఇంటలిజెన్స్ అదనపు డీసీపీగా, నర్సయ్యను ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీగా, పిచ్చయ్యను సీఐడీ అదనపు సూపరింటెండెంట్‌గా, కమలాకర్‌రెడ్డిని ఏసీబీకి, మహ్మద్ ఇక్బాల్ సిద్దిఖీని సైబరాబాద్ అడిషనల్ డీసీపీగా క్రైమ్ విభాగానికి, కిషన్‌ను భూపాలపల్లి అదనపు ఎస్పీగా, మజీద్‌ను సౌత్ జోన్ అడిషనల్ డీసీపీగా బదలీలు చేసింది. మొత్తంగా ముగ్గురు నాన్ క్యాడర్ సూపరింటెండ్లను, 30మంది అదిషనల్ సూపరింటెండెట్లకు ప్రభుత్వం స్థానచలనం కల్పిస్తూ, పలువురికి పోస్టింగ్‌లనిస్తూ నిర్ణయం తీసుకుంది.

## రాజ్యాంగం మన పవిత్ర గ్రంథం



- మహిళా రిజర్వేషన్లతో కొత్త శకం ఆరంభం, రాజ్యాంగం వల్లే సామాజిక న్యాయం, అభివృద్ధి సాధ్యమైంది
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- పాత పార్లమెంటు భవనంలో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

భారత రాజ్యాంగం సజీవ, ప్రగతిశీల పవిత్ర గ్రంథమని– దాని ద్వారా సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలను సాధించామని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. దేశానికి రాజ్యాంగం మూలస్తంభం వంటిదని రాష్ట్రపతి అన్నారు. రాజ్యాంగ రచనలో 15 మంది మహిళ లు భాగస్వాములైనట్లు రాష్ట్రపతి గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టంతో మహిళా సాధికారత దిశగా కొత్తశకం మొదలైనట్లు చెప్పారు. రాజ్యాంగాన్ని ఆమోదించి నేటితో 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాత పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు.


'రాజ్యాగం మన పవిత్ర గ్రంథం. ప్రజాస్వామ్య, గణతంత్ర సూత్రాల ఆధారంగా రాజ్యాంగ రూపకల్పన జరిగింది. రాజ్యాంగానికి రాజేంద్రప్రసాద్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మార్గనిర్దేశం చేశారు. ప్రగతిశీల సూత్రాల గురించి రాజ్యాంగంలో పొందుపర్చారు. రాజ్యాంగ రచనలో భాగస్వాములను స్మరించుకోవాలి. గత కొన్నేళ్లలో ప్రభుత్వం దేశంలోని అన్నివర్గాలు ముఖ్యంగా బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేకచర్యలు తీసుకుంది. అలాంటి నిర్ణయాలతో ప్రజల జీవితాలు మెరుగుపడ్డాయి. వారికి అభివృద్ధికి సంబంధించి కొత్త అవకాశాలు లభిస్తున్నాయి. పేదల సొంతింటి కల నిజమవుతోంది. విద్యుత్తు, తాగునీరు, రోడ్డు సదుపాయాలు లభిస్తున్నాయి. వైద్యసేవలు కూడా లభిస్తున్నాయి. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సమగ్ర అభివృద్ధి దిశగా చేపడుతున్న చర్యలు రాజ్యాంగ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నాయి' అని ముర్ము ప్రసంగించారు.

రాష్ట్రపతి ప్రసంగం అనంతరం సభ్యులందరితో కలిసి రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం చేశారు. అంతకుముందు రాజ్యాంగానికి సంబంధించిన రెండు పుస్తకాలు, 75 వసంతాలకు గుర్తుగా స్మారక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు. మైథిలీ, సంస్కృత భాషల్లో రాజ్యాంగాన్ని విడుదల చేశారు. రాష్ట్రపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సహా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగిస్తూ దేశం కంటే వ్యక్తిగత విశ్వాసాలకు ప్రాధాన్యం ఇస్తే మనం సాధించుకున్న స్వాతంత్ర్యం ప్రమాదంలో పడుతుందని అన్నారు. గందరగోళం సృష్టించడాన్ని ఒక వ్యూహంగా అమలు చేస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. నిర్మాణాత్మక చర్చలు ప్రజాస్వామ్య దేవాలయాల పవిత్రతను పెంపొందిస్తాయని తెలిపారు. అంతకంటే ముందు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభోపన్యాసం చేశారు. 75 ఏళ్ల క్రితం ఆమోదించిన రాజ్యాంగంపై చర్చించేటప్పుడు రాజ్యాంగ సభ నిర్దేశించిన నిర్మాణాత్మక, గౌరవప్రదమైన చర్చల సంప్రదాయాన్ని అనుసరించాలని సూచించారు.

## బ్యాలెట్ పేపర్లే కావాలి

- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు వద్దని, బ్యాలెట్ పేపర్లే తాము కోరుకుంటున్నట్లు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. దేశంలో ఐక్యత కావాలంటే విద్వేషాలను విస్తరించడం మానుకోవాలని బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. జతీల్లీలోని తల్కటోరా స్టేడియంలో నిర్వహించిన 'సంవిధాన్ రక్షక్ అభియాన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్‌కు తిరిగి వచ్చేందుకు భారత్ జోడో యాత్ర తరహాలో ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కొందరు రాజ్యాంగాన్ని పొగిడి, దానికి నమస్కరించి భక్తిని ప్రదర్శిస్తుంటారని ఖర్గే అన్నారు. లోపల మాత్రం రాజ్యాంగాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారన్నారు. ఈ యాత్రలో ఆయనతో పాటు సమాజంలోని అన్నివర్గాల ప్రజలు కదిలివచ్చారని తెలిపారు.



# వరంగల్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సహకరించండి

- పాల్వంచ, అంతర్గాం, ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్‌లు మంజూరు చేయండి
- కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుకు సీఎం రేవంత్ రెడ్డి వినతి

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో


తెలంగాణలో రెండో రాజధాని నగరంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన అనుమతులను మంజూరు చేయడంతో పాటు తక్షణం పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు గారికి విజ్ఞప్తి చేశారు. ఆ విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన 253 ఎకరాల భూ సేకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ.205 కోట్లను భారత విమానయాన సంస్థ కి అందజేసినట్టు తెలిపారు.

తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్రానికి చెందిన అందుబాటులో ఉన్న ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి గారు ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గారిని కలిసి చర్చించారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందని ముఖ్యమంత్రి వివరిస్తూ, వరంగల్‌తో పాటు పాల్వంచ, అంతర్గాం, ఆదిలాబాద్‌లలో ప్రతిపాదిత విమానాశ్రయాల గురించి కేంద్ర మంత్రికి నివేదించారు.

వరంగల్ తో పాటు మిగతా ప్రాంతాల్లో విమానాశ్రయాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై వారితో చర్చించారు. ఒక విమానాశ్రయం నుంచి మరో విమానాశ్రయానికి 150 కి.మీ దూరం ఉండాలన్న నిబంధన అడ్డురాదని, ఆ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జీఎంఆర్ సంస్థ నుంచి నిరభ్యంతర పత్రం పొందిన అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటుకు గతంలో గుర్తించిన స్థలం అనువుగా లేనందున ప్రత్యామ్నాయంగా పాల్వంచలో 950 ఎకరాలు గుర్తించినట్టు సీఎం గారు వివరించారు. ఆ భూమి వివరాలు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అందజేశామని, వెంటనే విమానాశ్రయ ఏర్పాటుకు తదుపరి చర్యలు తీసుకోవాలని కోరారు.

పెద్దపల్లి జిల్లాలో గతంలో గుర్తించిన భూమి విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేదని ఏఏఐ ప్రీ–ఫీజుబిలిటీ సర్వేలో తేలిన విషయాన్ని ముఖ్యమంత్రి గారు ప్రస్తావిస్తూ, అందుకు ప్రత్యామ్నాయంగా అంతర్గాంలో 591.24 ఎకరాలు గుర్తించామని, దానిపై తదుపరి చర్యలు చేపట్టాలని కోరారు. ఆదిలాబాద్‌లో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో ఇప్పటికే 369.50 ఎకరాల భూమి ఉందని, పూర్తి స్థాయి కార్యకలాపాల విస్తరణకు అదనంగా 249.82 ఎకరాలు అవసరమని, అదనంగా అవసరమైన భూమిని సేకరించి అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కలిసిన సందర్భంగా పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, రామసహాయం రఘురాం రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు, కడియం కావ్య గారు, కుందూరు రఘువీర్ ఉన్నారు.

## 222.27 ఎకరాల భూమిని రాష్ట్రానికి బదిలీ చేయాలి



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మూసీ పునరుజ్జీవంలో భాగంగా హైదరాబాద్ నగరంలోని ఈసా, మూసా నదుల సంగమ స్థలంలోని బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు అభివృద్ధి కోసం రక్షణ శాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమిని రాష్ట్రానికి బదిలీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారిని విజ్ఞప్తి చేశారు. మహాత్మాగాంధీ గారి చితాభస్మాన్ని కలిపిన చోట ఏర్పాటు చేసిన బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయిలో గాంధీ తాత్వికతను చాటిచెప్పే కేంద్రంగా తీర్చిదిద్దాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రాజెక్టు వివరాలను కేంద్ర మంత్రికి సీఎం గారు తెలియజేశారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్రానికి చెందిన అందుబాటులో ఉన్న ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ గారు, రామసహాయం రఘురాం రెడ్డి , చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య, కుందూరు రఘువీర్ తదితరులతో కలిసి సీఎం ఢిల్లీలో రక్షణ మంత్రిని కలిశారు.బాపూ ఘాట్ వద్ద గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం (మెడిటేషన్ విలేజ్), చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ల్యాండ్ స్కేప్ ఘాట్లు, శాంతి విగ్రహం , మ్యూజియంలతో గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టనున్నామని సీఎం వివరించారు. ఇందుకోసం రక్షణ శాఖ భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# అదానీతో రూ.12,400 కోట్ల ఒప్పందాలు ఎందుకు రద్దు చేయడం లేదు

- ప్రశ్నిస్తే తాను సైకోనా
- నేను అదానీని ఎంకరేజ్ చేయలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అదానీ ఫౌండేషన్ స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన రూ.100 కోట్ల విరాళాన్ని తీసుకోబోమంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, మరి అదానీతో రూ.12,400 కోట్ల ఒప్పందాలు ఎందుకు రద్దు చేయడం లేదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో పాలన అస్తవ్యస్తంగా మారిపోయిందని అన్నారు. ఆయన గిరిజన బాలిక శైలజ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు.

20 రోజుల పాటు మృత్యువుతో పోరాడి చనిపోయిన బాలిక ఘటన ఎంతో కలిసి వేసిందన్నారు. కాంగ్రెస్ సర్కారు కొలువు దీరాక.. గురుకులాల్లో 48 మంది విద్యార్థులు చనిపోయారన్నారు. చాలా మంది విద్యార్థులకు చదివించే స్థోమత లేక.. సర్కారు హాస్టల్ లోకి పంపిస్తారని అన్నారు. కానీ రేవంత్ సర్కారు మాత్రం.. విద్యార్థులు ప్రాణాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ఇది ప్రభుత్వం చేయించిన హత్యలంటూ ఎద్దేవా చేశారు. తన నియోజక వర్గం.. ఎల్లారెడ్డి పేట్ లో ఓ విద్యార్థి గురుకుల పాఠశాలలో చనిపోతే ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళితే ఆ తల్లిదండ్రులు తమలాంటి కడపుకోత వేరే వారికి రాకుండా చూడాలని చెప్పారన్నారు. ఈ విషయాన్ని ఇంతటితో వదిలేది లేదన్నారు. ఆ కుటుంబాల తరపున.. శాసన సభలో కూడా ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతామని కేటీఆర్ అన్నారు.

కష్టాలు వచ్చాయని పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవద్దని, ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. విద్యార్థులు ఎవరైన.. ఆరోగ్యం బాగాలేకపోతే మేము ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్పిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. సీఎం రేవంత్ లో.. ఫ్రస్టేషన్, నిరాశ, నిస్పృహలు కన్పిస్తున్నాయన్నారు. మహా రాష్ట్ర ఎన్నికలలో కాంగ్రెస్ బొర్లా బొక్క పడిందన్నారు. అదానీ వ్యవహారంలో రాహుల్ గాంధీ.. రేవంత్ కు చివాట్లు పెట్టారన్నారు. రేవంత్ రెడ్డికి ఆయన అనుకున్న విధంగా సీఎం కుర్చీ ఎక్కి.. కావాల్సినంత దోపిడి చేశారన్నారు. ఇంకా ఈ బూతులు తిట్టడం ఎందుకని అన్నారు.

నిన్న ఆయన మాట్లాడిన మాటలు విన్న తర్వాత.. చిట్టినాయుడు చిప్ దొబ్బినట్లు అన్పించిందన్నారు. బీఆర్ఎస్.. అదానీకి ప్రాజెక్ట్ లు ఇచ్చామంటాడు. ప్రజల్ని పూర్తిగా తప్పుదొవపట్టించేలా రేవంత్ మాట్లాడుతున్నారన్నారు. రక్షణ శాఖ కు ఇచ్చిన ప్రాజెక్ట్ లు తామిచ్చాడని అంటున్నాడని.. రక్షణ శాఖ మా చేతిలో ఉంటుందా?.. మరీ రాజ్ నాథ్ సింగ్ గారు ఏం చేస్తున్నట్లు?.. అంటూ కేటీఆర్ సెటైర్ లు వేశారు. విద్యుత్ ప్రాజెక్ట్ కూడా కేంద్రం ఇచ్చిందే.ఇంత తెలివి తక్కువ గా మాట్లాడితే ఏం అనుకోవాలంటూ రేవంత్ కు కేటీఆర్ చురకలు పెట్టారు. చిట్టి నాయుడుకు ఏమీ తెలియదు. పోనీ.. ఎవరన్న చెప్పిన వినడు. ఆయన మూరు?డంటూ కూడా కేటీఆర్ ఫైర్ అయ్యాడు.

మైక్రోసాఫ్ట్ నుంచి రెండు దశల్లో ఒకసారి రూ. 15 వేల కోట్లు....రెండో సారి రూ. 16 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చినట్లు కేటీఆర్ చెప్పారు. కానీ ఈ ముఖ్యమంత్రి మాత్రం అది అదానీ డేటా సెంటర్ అని రిలీజ్ చేశాడని అంటున్నారు. మైక్రో సాఫ్ట్ డేటా సెంటర్ పెట్టుబడిని.. అదానీ డేటా సెంటర్ అని తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. సబ్జెక్ట్

వివరాలు 3వ పేజీలో

# మళ్లీ ఫుడ్ పాయిజన్

- నారాయణపేట జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు అస్వస్థత

బలగం టీవి, హైదరాబాద్



ప్రభుత్వ పాఠశాలలో మళ్లీ ఫుడ్ పాయిజన్ అయింది. నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత వాంతులు, విరేచనాలతో 40 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని మాగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో 17 మందిని మెరుగైన వైద్యం కోసం మక్తల్ అస్పత్రికి తరలించారు. ముగ్గురిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కొద్దిరోజుల కిందటే ఇదే పాఠశాలలో 100 మందికిపైగా ఫుడ్ పాయిజన్ కావడంతో సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు జిల్లా కలెక్టర్ పలుమార్లు మాగనూరుకు వెళ్లి విచారణ చేపట్టారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు అధికారులను సస్పెండ్ చేయగా, మరికొందరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయినా మరోసారి ఫుడ్ పాయిజన్ కావడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మక్తల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పరామర్శించారు. మధ్యాహ్నం పాఠశాలలో విద్యార్థులకు వంకాయ సాంబార్‌తో కూడిన భోజనం పెట్టారని వారు తెలిపినట్టు చెప్పారు.

## ఫ్యాన్సీ నెంబర్లకు డిమాండ్...

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రంలోని ఫ్యాన్సీ నంబర్లకు రోజురోజుకు పోటీ ఎక్కువగా ఉంటోంది. తాజాగా ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయానికి కాసుల పంట పండింది. ఫ్యాన్సీ నంబర్లతో ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయానికి ఒక్కరోజే రూ.52,52,283 ఆదాయం సమకూరింది అని హైదరాబాద్ జేటీసీ రమేశ్ తెలిపారు.

మంగళవారం సెంట్రల్ జోన్‌లోని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన ఫ్యాన్సీ నంబర్ల ఈ–వేలంలో వినియోగదారులు పోటీపడ్డారు. ఈ వేలం ద్వారా సుమారు రూ.52,52,283 ఆదాయం వచ్చిందని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) సి.రమేష్ తెలిపారు. ఇదిలావుంటే ఆన్‌లైన్ ఈ–వేలంలో రుద్రరాజు రాజీవ్ కుమార్ తమ విలువైన కారు కోసం రూ.11.11లక్షలకుపైగా వెచ్చించి టీజీ09 డి 0001 నంబర్‌ను సొంతం చేసుకున్నారు. టీజీ09 డి 0009 నంబర్‌ను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్స్ లిమిటెడ్ సంస్థ తమ ఖరీదైన కారు కోసం రూ.10.40 లక్షలు చెల్లించి దక్కించుకుంది. టీజీ09సీ 9999 నంబర్‌ను శ్రీయాన్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ రూ.7.19 లక్షలకుపైగా వెచ్చించి కైవసం చేసుకుంది. టీజీ09 డీ 0006 నెంబర్‌ను ఫోరస్ అగ్రో ఫుడ్ ప్రాడక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ రూ.3.65లక్షలు చెల్లించి సొంతం చేసుకుంది. టీజీ09డీ 0005 నంబర్‌ను వేగాశ్రీ గోల్డ్ అండ్ డైమాండ్ ఎల్ఎల్‌పీ 3.45లక్షలు, టీజీ09డీ 0007 నంబర్‌ను ఎన్స్పిరా మేనేజ్‌మెంట్

వివరాలు 3వ పేజీలో

# త్వరలోనే మల్కపేట రిజర్వాయర్ నింపుతాం..

- మన ప్రాంత అభివృద్ధి ధ్యేయంగా ముందుకు పోతున్న..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్..



**బలగం టివీ , వేములవాడ**

దేశ చరిత్రలో ఒక సాహసోపేతమైన నిర్ణయం తెలంగాణ ప్రభుత్వం తీసుకొని, దేశానికి తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ గా ఉండేలా ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ చేశామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ

మంగళపల్లి గ్రామ ప్రజల చిరకాల కోరిక నేడు నెరవేరింది,గత ప్రభుత్వ హయాంలో నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న కనీసం పట్టించుకునే పాపాన పోలేదు అని,ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం నేడు భూమి పూజ నిర్వహించుకున్నామని అన్నారు.మధ్య తరగతి భావజాలం ఉన్నవారి చేతిలో పదవి ఉంటే,మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుందని అనడానికి ఇదే నిదర్శనమని అన్నారు.ఎన్నికల ముందు మీకు ఇచ్చిన మాట ప్రకారం మీలో ఒకడిగా, మీ కుటుంబ సభ్యుడిగా ఉంటూ మీ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు పోతున్నానని అన్నారు.

11 నెలలుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రతిరోజు ప్రజల మధ్య ఉంటున్న, మంగళవారం వేములవాడ నియోజకవర్గంలో శంకుస్థాపనల జాతర జరిగిందని అన్నారు. 13 పనులకు 13 కోట్ల 40 లక్షలతో వివిధ పనులకు శంకుస్థాపనలు చేశామని, వేములవాడకు ముఖ్యమంత్రి వచ్చిన రోజు వేములవాడ నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారు అని అన్నారు.ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఉపయోగపడే పథకాలను తీసుకొస్తున్నామని, ఇప్పటికే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, 10 లక్షల ఆరోగ్యశ్రీ పెంపు, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేశామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి తేడా చూస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతు రుణమాఫీ పావలా,పావలా చేసింది తప్ప,రైతులకు చేసిందేమీ లేదు అని అన్నారు.మొన్నటి రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో రోజంతా ప్రభుత్వం వేములవాడ లోనే ఉంది అని,వేములవాడ ఆలయ అభివృద్ధి, రోడ్డు వెడల్పు,ముంపు గ్రామాల ప్రజలకు 4696 ఇందిరమ్మ ఇల్లను మంజూరు చేయడం జరిగింది అని అన్నారు.



త్వరలోనే మల్కపేట రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తి చేసి నీటితో నింపుతామని,మీకు ఏ సమస్య వచ్చినా నేను అండగా ఉంటా అని అన్నారు.మన ప్రాంత అభివృద్ధి ధ్యేయంగా ముందుకు పోతున్న అని అన్నారు. ఈ సందర్భంగా వేములవాడ నియోజకవర్గానికి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పంచాయితీ రాజ్ మంత్రి సితక్క లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# రాజ్యాంగ మౌలిక సూత్రాలను ఆచరిద్దాం..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టివి , రాజన్న సిరిసిల్ల**

భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ ఆయా ధర్మాలను అనుసరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యాంగానికి సంబంధించిన ప్రతిజ్ఞను సిబ్బంది, అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేయించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ బ్రిటీష్ వారు 200 కు పైగా సంవత్సరాలు భారతదేశాన్ని పాలించిన తరువాత మనకు స్వాతంత్ర్యం లభించిందని, మన రాజ్యాంగం రచించడానికి కమిటి ఎర్పాటు చేసి రెండు సంవత్సరాల పాటు చర్చించి 1949 నవంబర్ 26,న తుది రాజ్యాంగం ఆమోదించబడిందని తెలిపారు.ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశమైన భారతదేశానికి గొప్ప రాజ్యాంగం ను అందించారని అన్నారు. 2015 సంవత్సరం నుంచి రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని, దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించేందుకు పలువురు విద్యావేత్తలు, న్యాయనిపుణులు, వివిధ రంగాల ప్రముఖులతో రాజ్యాంగ నిర్మాణ సభను ఏర్పాటు చేశారని,2సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలోని డ్రాఫ్ట్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగం రూపొందిందనీ పేర్కొన్నారు. సిపిఓ. శ్రీనివాసా చారి, డిపిఆర్ఓ.వి.శ్రీధర్, ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, మున్సిపల్ కమిషనర్ లావణ్య, కలెక్టరేట్ ఏఓ.రామ్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు జావేద్ అహ్మద్, శ్రీకాంత్, పుష్పలత, షరీఫ్, వేణు, ప్రవీణ్, కలెక్టరేట్ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పనుల జాతరకు భూమి పూజ

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం ద్వారా పనుల జాతర నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా తంగళ్ళపల్లి మండల కేంద్రం కు చెందిన తుమ్మ దేవవరం అనే రైతుకు రూ 80,000 లతో పశువుల పాకను మంజూరు చేసి భూమి పూజ నిర్వహించారు.అనంతరం ఉత్తమ మల్టి పర్పస్ కార్మికులకు సన్మానం నిర్వహించి రాజ్యాంగ దివాస్ గా రాజ్యాంగ పీఠికను ఎంపీడీవో లక్ష్మీనారాయణ అందరి చే చదివించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఇట్టి భూమి పూజ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వేలూముల స్వరూప రెడ్డి,ప్యాక్స్ ఛైర్మన్ బండి దేవదాస్ గౌడ్,మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నెరల్లా నరసింగం గౌడ్,పాక్స్ వైస్ చైర్మన్ వెంకట రమణ రెడ్డి,మండల కాంగ్రెస్ ప్రెసిడెండ్ జాలగం ప్రవీణ్ టోనీ,అధికారులు డి ఆర్ డి ఓ శేషాద్రి, ఏపీడిఓ కోర నరసింహులు, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీఓ మీర్జా, ఇంచార్జ్ ఏపీవో రాజనర్సు,నాయకులు లక్ష్మీ రాజం,ప్రతాపరెడ్డి,బాలసాని శ్రీనివాస్,తిరుపతి రెడ్డి,పొన్నం లక్ష్మణ్ , కవటి మల్లేశం, సదకర్,ఎల్లయ్య, ఈజీఎస్ అధికారులు మరియు గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు సమర్థవంతంగా సేవలందించాలి..

- ఎస్పీ అఖిల్ మహాజన్..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భారత రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు సమర్ధవంతంగా సేవలందిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి,అనంతరం జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రజలందరికి ప్రాధమిక హక్కులను కల్పించడంతో పాటు ప్రజల ప్రయోజనాలు లక్ష్యంగా చట్టాలను సైతం పొందుపరిచారని అన్నారు . ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యాలుగా ఏర్పడిన పోలీస్ వ్యవస్థలో ఉన్న మనమంతా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పని చేస్తూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని,రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తూ దేశాభివృద్ధిలో బాగస్వామ్యం కావాలని అన్నారు . ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్థంభంగా నిలవడమే కాక ప్రపంచ దేశాలకు మన దేశం ఆదర్శంగా నిలవడంలో భారత రాజ్యాంగం ప్రధాన భూమిక పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ మురళి కృష్ణ, ఆర్ఐ లు మధుకర్, రమేష్, సిఐ లు శ్రీనివాస్, మధుకర్, శ్రీలత, ఎస్.ఐ లు కిరణ్, ఆర్ఎస్ఐ లు శ్రవణ్, శ్రీనివాస్,దిలీప్, పోలీస్ కార్యాలయ సిబ్బంది,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫౌల్ట్రీఫారం నిర్మాణం కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రామన్న పేట గ్రామంలో ఇ.జి.ఎస్ నిధుల ద్వారా ఫౌల్ట్రీఫారం నిర్మాణం కోసం చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశీల, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ ఛైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగుల కనుకయ్య, ఏపీవో సబిత, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు నాగుల వంశీ గౌడ్,మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.




## అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముషం రమేష్

**బలగం టీవీ, సిరిసిల్ల**

అర్హులైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల డ్రాలో పేర్లురాని 850 మందికి మొదటి ప్రాధాన్యత గా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి అని సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముషం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లారపు అరుణ్ కుమార్ లు మాట్లాడుతూ గత బిఆర్ ఎస్ ప్రభుత్వం అర్హులైన అందరికీ డబుల్ బెడ్ రూం లు అందిస్తామని చెప్పి డ్రా పెట్టి మోసం చేసింది అని అన్నారు.అప్పుడు పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలతో అప్పటి మంత్రి కేటిఆర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అందరికీ పట్టాలు అందించి, ఇంటి నిర్మాణానికి డబ్బులు ఇస్తామని 44 మందికి పట్టాలు అందించారని అన్నారు.ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఆగిపోయింది అని,పట్టాలు ఇచ్చారు గానీ ఎక్కడో చూపించలేదు అని అన్నారు.కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరకాలంగా పట్టాలు ఇచ్చి,ఐదు లక్షల ఇస్తామని ప్రకటించి, మళ్లీ దరఖాస్తులు పెట్టుకొమ్మంటున్నారు అని అన్నారు.గత పది సంవత్సరాలుగా సొంత ఇంటికల నెరవేర్చుకోవడానికి ఆందోళనలు,పోరాటాలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అర్హులైన 850 మందికి మొదటి ప్రాధాన్యత గా గుర్తించి,ఇచ్చిన పట్టాల కి భూమిని చూపించి ఇంటి నిర్మాణనికి ఐదు లక్షలు కేటాయించాలని అన్నారు. గురువారం ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కలిసి సమస్యలు పరిష్కరించమాని కోరడం జరుగుతుంది అని,ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీగా ఆందోళన పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్ల కార్యదర్శివర్గ సభ్యులు కోడం రమణ , సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ,సీపీఎం సిరిసిల్ల పట్టణ కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్,సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎలిగేటి రాజశేఖర్, రూప,జిందం కమలాకర్ , బెజుగం సురేష్,బింగి సంపత్ , సందుపట్ల పోషమల్లు సబ్బని చంద్రకాంత్ , మొర తిరుపతి , నల్ల బాబు తదితరులు పాల్గొన్నారు



# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..




**బలగం టీవీ, గంభీరావుపేట**

సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూనే, డయల్-100పై అవగాహన కలిగి ఉండాలని ,ఏదైనా సమస్య ఎదురైనప్పుడు పోలీసుల సాయం పొందాల్సి వస్తే, వెంటనే డయల్-100కు కాల్ చేయాలని ఎస్సై ఎల్. శ్రీకాంత్ అన్నారు. గంభీరావుపేట మండల మల్లారెడ్డిపేట గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యం లో మంగళవారం రాత్రి మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎల్. శ్రీకాంత్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులమని రుణమాఫీ వస్తుందని కరెంట్ బిల్లు కట్టాలని, కేవైసీ అప్డేట్ చేయాలని, విదేశాలలో మీ పిల్లలు ఉంటే వారి పేరు చెప్పి అక్కడ నేరం చేశారని చెప్పి మోసం కాల్ చేస్తారు. మీకు తెలియని లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, పిల్లల ప్రవర్తనలో ఏమైనా మార్పులు ఉన్నాయా, ఇంటికి ఏమైనా ఆన్లైన్ ద్వారా పార్సల్స్ వస్తున్నాయా ప్రతి ఒక్కటి గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల ప్రవర్తనలో ఏవైనా మార్పులు ఉంటే ఎలాంటి అనుమానం వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని తెలిపారు. యువతి యువకులను గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా కాపాడుకోవలసిన బాధ్యత తల్లిదండ్రుల పై ఉందన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అట్టి వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ , షీ టీమ్స్ జరుగుతున్న సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, వీపీవో శ్రీనాథ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి....ప్రమాదాలు నివారించండి

- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిచిన వాహనాలు,ర్యాష్ డ్రైవింగ్ చేసిన వాహనాలు, జిల్లాకు వచ్చే అనుమానిత వాహనాలను గుర్తించేందుకు జిల్లా సరిహద్దుల్లో జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్లే వాహనాలను గుర్తించేందుకు ఆటోమేటిక్ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని అందులో భాగంగా జిల్లెళ్ళ వద్ద ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ కెమెరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహజాన్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఇదివరకే నేతన్న చౌక్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ వద్ద అత్యాధునిక కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని,దానితో పాటుగా జిల్లా సరిహద్దుల్లో జిల్లెళ్ల, గంబిరావుపేట,రుద్రంగి, కోదురుపాక ఆధునిక ఆటోమేటిక్ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తద్వారా వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించిన, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ ర్యాష్ డ్రైవింగ్ చేసినా,అనుమానిత వాహనాలు వచ్చిన ఈ ఆటోమేటిక్ సిసి కెమెరాల ద్వారా గుర్తించడం జరుగుతుందన్నారు. వీటి ఆధారంగా నిబంధనలు ఉల్లఘించిన వాహనాలను, అనుమానిత వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.వాహనదారులు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ మొగిలి, ఎస్.ఐ రామ్మోహన్,సిబ్బంది ఉన్నారు.

## జీడిమెట్లలో భారీ అగ్నిప్రమాదం

**బలగం టీవీ, హైదరాబాద్**



హైదరాబాద్‌లోని జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది.

. దీంతో సదరు పరిశ్రమ యాజమాన్యంతోపాటు స్థానికులు వెంటనే స్పందించి.. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ఆరు ఫైరింజన్లతోపాటు 20 వాటర్ ట్యాంకర్లతో అగ్నిమాపక సిబ్బంది.. ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. దాదాపు రాత్రి వరకు శ్రమించినా మంటలు మాత్రం అదుపులోకి రాలేదు. ఈ క్రమంలో మంటలను అదుపులోకి తీసుకు వచ్చేందుకు వారు మరింత శ్రమిస్తున్నారు. మరోవైపు భారీగా మంటలు ఎగసిపడుతుండడంతో.. ముందస్తు చర్యల్లో భాగంగా పరిసర ప్రాంతంలోని ప్రజలను అగ్ని మాపక సిబ్బంది ఖాళీ చేయించారు.

## 29న ఐసీసీ సమావేశం...

**బలగం టీవీ, హైదరాబాద్**




మరి కొన్ని నెలల్లో ఛాంపియన్స్ ట్రోఫీ జరగనున్న నేపథ్యంలో, నవంబరు 29న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సమావేశం కానుంది. వచ్చే ఏడాది పాకిస్థాన్ లో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్, వేదికల ఖరారు గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి వేదికగా పాకిస్థాన్ ను గతంలోనే ఎంపిక చేశారు. అయితే ఈ టోర్నీలో పాల్గొనేందుకు పాకిస్థాన్ వెళ్లేది లేదని భారత్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ఈ నెల 29న జరిగే సమావేశంలో ఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఆసక్తి నెలకొంది.

## 30 నుంచి '6 అబద్ధాలు 66 మోసాలు' పేరుతో బీజేపీ నిరసన

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది అవుతోంది. ఈ క్రమంలో ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తోంది. కాంగ్రెస్ విజయోత్సవాలకు బీజేపీ కౌంటర్‌గా '6 అబద్ధాలు 66 మోసాలు' పేరుతో నిరసనలు చేపట్టాలని నిర్ణయించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదని చెబుతూ ఈ తరహా నిరసనలకు సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 5 వరకు నిరసన కార్యక్రమాలను నిర్వహించనుంది. ఒక్కోరోజు ఒక్కో విధంగా నిరసన తెలపనుంది. ఈ నెల 30న కాంగ్రెస్ వైఫల్యాలపై ఛార్జి షీట్, డిసెంబర్ 1న జిల్లాస్థాయిలో బీజేపీ ఛార్జిషీట్, డిసెంబర్ 2, 3 తేదీల్లో నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించింది. నిరసన చేపడుతున్న ఈ వారం రోజులు ప్రతిరోజు... ప్రతి నియోజకవర్గ కేంద్రంలో 2 వేల మందితో సభలు కూడా నిర్వహించనుంది.

## అదానీతో రూ.12,400 కోట్ల ఒప్పందాలు ఎందుకు రద్దు చేయడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలియక ఏదీ పడితే అది మాట్లాడితే తెలంగాణ రాష్ట్ర గౌరవం మంటకలుస్తుందని సెటైర్ లు వేశారు. గతంలో కూడా విప్రో ఛైర్మన్ సత్య నాదెళ్ల అంటూ నవ్వుల పాలు అయిన విషయం గుర్తు చేశారు. మైక్రో సాఫ్ట్ వచ్చాక ఆమెజాన్ వచ్చిందని.. అమెజాన్ రూ. 36 వేల కోట్లు పెట్టుబడులు పెట్టిందన్నారు. తాను.. అదానీని కలిశాను అని ఫోటో రిలీజ్ చేశాడు. బరాబర్ దావోస్ లో కలిశాను. ఆ ఫోటోను నేనే నా ట్విట్టర్ లో పెట్టినట్లు క్లారిటీ ఇచ్చారు. నీలాగా ఇంటికి పిలిపించుకోని నాలుగు గంటలు రహస్యంగా కలవలేదని.. కోహినూరు హోటల్ లో కాళ్లు పట్టుకోలేదంటూ ఎద్దేవా చేశారు. తనకు.. నీ లాగా లుచ్చా పనులు చేసే అలవాటు లేదని, ఏదీ చేసిన బజాప్తా చేస్తామంటూ ఫైర్ అయ్యారు. కొండారెడ్డి పల్లిలో నీకోసం పనిచేసిన మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు గురించి కూడా మాట్లాడారు. ప్రశ్నిస్తే.. సైకో అంటున్నవని ఎద్దేవా చేశారు. శైలజ అనే విద్యార్థి చనిపోతే వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తే.. తమ పార్టీ నేత కోవా లక్ష్మి గారు వెళ్తా ఉంటే ఆమె హౌజ్ అరెస్ట్ చేశారని అన్నారు.అనిల్ జాదవ్, జాన్సన్ నాయక్ లాంటి నేతలను కూడా అరెస్ట్ చేశారని.. పరామర్శించేందుకు వెళ్తే..నీకు కలిగే నొప్పి ఏంటని కేటీఆర్ మండిపడ్డారు. ఇంటర్ నెట్ షట్ డౌన్, అక్రమ అరెస్ట్ లు, నిర్బంధాలు ఇదే ప్రజా పాలనా?.. అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు.

## ఫ్యాన్సీ నెంబర్లకు డిమాండ్...

(మొదటి పేజీ తరువాయి)

సర్వీసెస్ ప్ర.లిమిటెడ్ రూ.2.06లక్షలకుపైగా, టీజీ09డీ 0019 నంబర్‌ను నంబర్‌మాల్ ప్ర.లిమిటెడ్ రూ.1.95లక్షలు, టీజీ09డీ 0099 నంబర్‌ను సీఎస్‌కే రియల్టర్స్ లిమిటెడ్ రూ.1.85లక్షలు, టీజీ09డీ 0077 నంబర్‌ను మీనాక్షీ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ ఎల్ఎల్‌పీ రూ. 1.17లక్షలకుపైగా వెచ్చించి సొంతం చేసుకున్నాయి. ఫలితంగా ఒక్కరోజులో రవాణాశాఖ ఖాజానాకు రూ.52.52లక్షలకుపైగా ఆదాయం సమకూరిందని జేటీసీ రమేష్ తెలిపారు.

## డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీల్లో కనీస వసతులకు నిధులు విడుదల

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీల్లో కనీస సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసింది. ఆయా కాలనీల్లో కనీస సౌకర్యాలు రూ.196కోట్ల 46లక్షల నిధులను మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు ఆర్అండ్‌బీ శాఖ జీఓ 892 జారీ చేసింది. కనీస సౌకర్యాల కల్పనలో భాగంగా డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీల్లో నీటి వసతి, విద్యుదీకరణ, మురుగునీటి పారుదల వ్యవస్థను చేపట్టనున్నారు. గత ప్రభుత్వం నిర్మించి కనీస సౌకర్యా లు కూడా కల్పించకుండా వదిలేయడంతో లబ్ధిదారుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# రైతు పండుగ విజయవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజానర్సింహా, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణా రావు
- రైతు సదస్సు ఏర్పాట్లపై సమీక్ష

బలగం టీవి, హైదరాబాద్

ఈనెల 28 , 29 , 30 తేదీల్లో మహబూబ్ నగర్ లో నిర్వహించే రైతు పండుగ విజయవం తంగా నిర్వహిం చడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసి పనిచేయాలని రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజానర్సింహా, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణా రావు లు అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాలో ఈనెల 28,29,30 తేదీలలో నిర్వహించే రైతు సదస్సు ఏర్పాట్లపై నేడు సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్. చిన్నారెడ్డి, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, కలెక్టర్లు, ఎస్.పి లు తదితరులు హాజరయ్యారు.



ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఈ సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం మరే రంగానికి లేని విధంగా వ్యవసాయ రంగానికి అధిక మొత్తం నిధులు కేటాయించిందని, ముఖ్యంగా రైతు రుణ మాఫీ తో రాష్ట్రంలోని ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గంలో కనీసం 20 వేల మంది నుండి 30 వేల మంది రైతులకు లబ్ది చేకూరిందని గుర్తు చేశారు. రైతులకు పెద్ద ఎత్తున చేకూరిన ఈ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలు, వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, ఆదర్శ రైతుల ప్రసంగాలు, ఈ రైతు సదస్సులో ప్రధాన అంశాలుగా ఉంటాయని తెలిపారు. ఈనెల 28 న ఉదయం 10 గంటలకు ఈ రైతు సదస్సు ప్రారంభమవుతుందని, ఈ మొదటి రోజు సదస్సుకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన రైతులు హాజరవుతారని, ఈ ప్రారంభ సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గా తాను ప్రారంభిస్తానని, ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తుమ్మల చెప్పారు. రెండోరోజైన 29 న మహబూబ్ నగర్ జిల్లాయేతర ప్రాంతాలనుండి రైతులు హాజరవుతారని, 30 న రాష్ట్రంలోని అన్ని జిల్లాలనుండి కనీసం లక్ష మంది రైతులు ఈ రైతు సదస్సుకు హాజరవుతారని వివరించారు. మొదటి రెండు రోజులు ప్రతీ రోజు 5000 మంది రైతులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. 30 వ తేదీన సదస్సుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

ఈ మూడు రోజులు రైతు సదస్సు వేదికపై ఆదర్శ రైతులచే ప్రసంగాలు, ఆధునిక వ్యవసాయ విధానాలపై వివరణలు, వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ మత్స్య తదితర రంగాలకు చెందిన ఆదర్శ రైతులచే ప్రసంగాలు, విజయగాధలపై వీడియో ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. ఒక్కొక్క పంటకు సంబంధించి ఒక్కొక్క ఆదర్శ రైతును గుర్తించి వారి అనుభవాలు ఈ సదస్సులో వివరిస్తారని మంత్రి తెలిపారు.

ఆధునిక వ్యవసాయ యంత్ర సామాగ్రి, వివిధ రకాల పంట రీతులు, హైబ్రిడ్ వంగడాలు, ప్రభుత్వం అమలుచేస్తున్న పలు పథకాలపై ప్రదర్శన స్టాళ్ళను సంబంధిత శాఖలు ఏర్పాటు చేస్తాయని తెలిపారు. ఈ మూడురోజుల కార్యక్రమాలను రాష్ట్రంలోని 560 రైతు వేదికల ద్వారా లైవ్ ప్రసారం చేయాలని వ్యవసాయ శాఖా మంత్రి ఆదేశించారు. ఈ రాష్ట్ర స్థాయి సదస్సు కు వాహనాల పార్కింగ్, ట్రాఫిక్, స్టాళ్ళ ఏర్పాటు, రైతులకు అవగాహన తదితర కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ఈ సమీక్ష సమావేశానికి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కె.దామోధర్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు డా. శ్రీహరి, మేఘా రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీ కృష్ణ, పర్ణిక రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస రాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా జీఏడీ కార్యదర్శి రఘునందన్, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయి అన్నట్టు ఉంది

- కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదు
- ఏడాది పాలనలో రేవంత్ రెడ్డి తిన్నన్ని తిట్లు ఏ పాలకుడు తిని ఉండడు.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో దీక్ష దివాస్ సన్నాహక సమావేశం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ వర్గం కూడా సంతోషంగా లేదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయి మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఏడాది పాలనలో ప్రజలతో ఇన్ని తిట్లు తిన్న పాలకులు గతంలో ఎవ్వరూ లేరని చెప్పారు. ఈ నెల 29 నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమానికి సంబంధించి హైదరాబాద్ జిల్లా సన్నాహక సమావేశాన్నితెలంగాణ భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్...కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలో కాంగ్రెస్ కు ఒక్క సీటు కూడా ఇవ్వని నగర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రేవంత్ రెడ్డి ఎత్తైన కుర్చీలో కూర్చొని గొప్ప మనిషిని కావాలని భావిస్తున్నాడని....కానీ కేసీఆర్ లా ప్రజలకు మంచి చేసినప్పుడు మాత్రమే వారి గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకోగలమని గుర్తించటం లేదన్నారు. మూసీ, హైడ్రా, ఆటో డ్రైవర్లు ఇలా నగర ప్రజలపై పగ పెంచుకోని కాంగ్రెస్ సర్కార్ వారిని వేధిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం పెడుతున్న బాధలను చెప్పుకునేందుకు ప్రజలు తెలంగాణ భవన్ కు వస్తున్నారని...తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్ గా మారిందన్నారు.

### ఎప్పుడు ఎన్నికలు వచ్చిన మనమే గెలుస్తాం.

కాంగ్రెస్ తప్పుడు హామీలను నమ్మి మోసపోయామని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారన్నారు. వెలుగు విలువ చీకటి ఉన్నప్పుడే తెలుస్తుందని.. .కేసీఆర్ గారిని పోగొట్టుకున్నామని ప్రజలంతా ఆవేదనలో ఉన్నారని కేటీఆర్ అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన బీఆర్ఎస్ అఖండ మెజార్టీ గెలవటం ఖాయమని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి పదవులు, ఇతర పదవులు అనుభవించిన వారు పార్టీ మారినప్పటికీ కార్యకర్తలు మాత్రం బీఆర్ఎస్ కు కొండంత అండగా ఉన్నారని చెప్పారు. కష్ట సమయంలోనే ఎవరు మనవారు, ఎవరు బయట వాళ్లు అనేది తెలుస్తుందని చెప్పారు.

### హైదరాబాద్ ను నాలుగు ముక్కలు చేసే కుట్ర

ఓఆర్ఆర్ లోపల ఉన్న హైదరాబాద్ ని మూడు లేదా నాలుగు ముక్కలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నాడని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ ఇమేజ్ ను డ్యామేజ్ చేసే కుట్రలో బీజేపీకి కూడా భాగం ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై ఎంపీ ఎన్నికల్లో చెరి ఎనిమిది సీట్లు వచ్చేలా ప్లాన్ చేసుకున్నారని కేటీఆర్ అన్నారు. కానీ బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్ అంటూ తప్పుడు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో హైడ్రా కూల్చివేత్తలు మొదలు పెట్టగానే... ముందుగా ప్రభుత్వానికి మద్దతిచ్చింది బీజేపీ నేతలు రఘునందన్, బండి సంజయ్ లేనని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ రెండు పార్టీల చీకటి దోస్తానాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీజేపీకి, కాంగ్రెస్ అధిష్టానానికి రేవంత్ రెడ్డి డబ్బుల మూటలు పంపిస్తున్నారని కేటీఆర్ విమర్శలు చేశారు. బీజేపీ తో కలవాల్సిన అవసరం బీఆర్ఎస్ కు లేనే లేదని తేల్చిచెప్పారు.

### ఏ వర్గం సంతోషంగా లేదు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదని కేటీఆర్ అన్నారు. రైతులు, నేతన్నలు, ఆటో డ్రైవర్లు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు, గురుకులాల్లో విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు ఇలా ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను పార్టీ శ్రేణులను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నిత్యం జనంలో ఉండి ప్రజల కష్టాల్లో తోడు ఉండే వారందరికీ అవకాశాలు లభిస్తాయని కేటీఆర్ చెప్పారు. దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా కేటీఆర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, మాగంటి గోపినాథ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ మధుసూదనా చారి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సహా బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## ఆస్ట్రేలియా టూర్ నుంచి అత్యవసరంగా భారత్‌కు గంభీర్...

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత జట్టు హెడ్ కోచ్ గౌతం గంభీర్ అత్యవసరంగా ఇంటికి బయలుదేరినట్టు తెలిసింది. కుటుంబ సంబంధమైన అత్యవసర పరిస్థితుల కారణంగానే గంభీర్ స్వదేశానికి వస్తున్నట్టు సమాచారం. అయితే, అడిలైడ్‌లో ప్రారంభం కానున్న రెండో టెస్టు (డే-నైట్ టెస్ట్) నాటికి ఆయన మళ్లీ ఆస్ట్రేలియా చేరుకునే అవకాశం ఉంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఐదు టెస్టులు జరగనుండగా పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో ఘన విజయం సాధించిన భారత్ 1-0తో సిరీస్‌లో ముందంజ వేసింది. ఇక రోహిత్ జట్టు బుధవారం రెండ్రోజుల పింక్‌బాల్ టూర్ గేమ్ కోసం కాన్‌బెర్రా వెళ్లనుంది. కాగా, భారత్ వెళ్లనున్న గంభీర్ శనివారం నాటి భారత జట్టు ప్రాక్టీస్‌కు అందుబాటులో ఉండడని టీమిండియా వర్గాలు తెలిపాయి. డిసెంబర్ 6వ తేదీన అడిలైడ్‌లో జరగనున్న రెండవ టెస్టుకు ముందు.. మళ్లీ గంభీర్ జట్టుతో కలవనున్నట్లు బీసీసీఐ వర్గాల ద్వారా వెల్లడైంది

# వేలంలో అమ్ముడుపోని స్టార్స్ వీరే..









**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2025 మెగావేలం ముగిసింది. అయితే టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్లను కొనుగోలు చేసేందుకు ఫ్రాంచైజీలు మొగ్గు చూపలేదు. పృథ్వీ షా, మయాంక్ అగర్వాల్, శార్దూల్ ఠాకూర్, కేఎస్ భరత్, సర్ఫరాజ్ ఖాన్ సహా మరికొందరు క్రికెటర్లు అన్ సోల్డ్ గా మిగిలిపోయారు.

శార్దూల్ ఠాకూర్ రూ.2 కోట్ల బేస్ ధరతో వేలంలోకి వచ్చాడు. మయాంక్ అగర్వాల్ రూ.కోటి, సర్ఫరాజ్ ఖాన్, పృథ్వీ షా, శ్రీకర్ భరత్ రూ.75 లక్షలతో వేలంలోకి ఎంట్రీ ఇచ్చారు. అయినప్పటికీ వీరిని కొనేందుకు ఏ ఫ్రాంఛైజీ ఆసక్తిని చూపకపోవడం వల్ల అన్ సోల్డ్ ప్లేయర్లుగా మిగిలిపోయారు.

పృథ్వీ షా గత ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడాడు. ఆ సీజన్‌లో అంతగా రాణించలేకపోయాడు. అలాగే పేలవ ఫామ్‌తో పాటు ఫిట్ నెస్ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ కారణంగానే అతన్ని ఎవరూ కొనలేదని తెలుస్తోంది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ కు సైతం నిరాశ తప్పలేదు. కనీస ధర రూ.1.5 కోట్లకు వేలంలోకి వచ్చిన ఈ ప్లేయర్‌ను తీసుకోవడానికి ఎవరూ ఆసక్తి కనబరచలేదు. 2024 ఐపీఎల్ సీజన్ లో సన్ రైజర్స్ తరపున పెద్దగా రాణించలేదు.

టీమ్ ఇండియా పేసర్ శార్దూల్ ఠాకూర్ 2024 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడాడు. 21 పరుగులు చేశాడు. అలాగే ఐదు వికెట్లు మాత్రమే తీశాడు. దీంతో అతడిని కొనుగోలు చేసేందుకు ఏ ఫ్రాంచైజీ మొగ్గు చూపలేదు. అలాగే టీమ్ ఇండియా వికెట్ కీపర్ కేఎస్ భారత్, దేవదత్ పడిక్కల్‌ను కూడా ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు. యంగ్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ కూడా అన్ సోల్డ్‌గా మిగిలిపోవడం ఆశ్చర్యకరం రంజీల్లో టన్నుల కొద్దీ పరుగులు చేసిన సర్ఫరాజ్‌ను కొనేందుకు ఏ ఫ్రాంచైజీ మొగ్గు చూపలేదు.

# అక్కినేని అఖిల్ నిశ్చితార్థం



**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని అఖిల్ నిశ్చితార్థం చేసుకున్నాడు. జైనాబ్ రవ్జీ అనే అమ్మాయి ఆయన జీవితంలోకి రానుంది. హైదరాబాద్‌లోని నాగార్జున ఇంట్లో కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ వేడుక జరిగింది. ఈ క్రమంలో అఖిల్.. తన నిశ్చితార్థం ఫొటోలని సోషల్ మీడియా వేదికగా విడుదల చేశాడు.

ప్రముఖ పారిశ్రామిక వేత్త జుల్ఫీ రవ్జీ కూతురే జైనాబ్ అని తెలుస్తోంది. ఈమెకు స్కిన్ కేర్‌కి సంబంధించిన కంపెనీ ఉన్నట్లు తెలుస్తోంది. భారత్, దుబాయి, లండన్‌లో ఈమె పెరిగింది. కొన్నాళ్ల క్రితంగా ప్రేమలో ఉన్న అఖిల్-జైనాబ్.. పెద్దల్ని ఒప్పించి ఇప్పుడు నిశ్చితార్థం చేసుకున్నారని తెలిసింది. వచ్చే ఏడాది పెళ్లి ఉంటుందని అక్కినేని ఫ్యామిలీ ప్రకటించింది.

ఇదిలా ఉండగా అఖిల్-జైనబ్‌ని ఆశీర్వదించాలని నాగార్జున అక్కినేని కోరారు. ఇదలా ఉండగా నాగార్జున పెద్ద కొడుకు నాగచైతన్య-శోభిత.. డిసెంబరు 4న హైదరాబాద్‌లో వివాహం చేసుకోబోతున్నారు. ప్రస్తుతం అక్కినేని ఫ్యామిలీకి పెళ్లికళ వచ్చేసింది.



## పుష్ప నటుడు శ్రీతేజ్‌పై కేసు

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ సినీ నటుడు శ్రీతేజ్‌పై కూకట్‌పల్లి పీఎస్‌లో కేసు నమోదైంది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని శ్రీతేజ్‌పై ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో శ్రీతేజ్‌పై బీఎన్ఎన్ 69, 115 (2), 318 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 'వంగవీటి', 'లక్ష్మీస్ ఎన్టీఆర్', 'పుష్ప ది రైజ్', 'మంగళవారం', 'ధమాకా' తదితర సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీతేజ్ ప్రస్తుతం అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న 'పుష్ప ది రూల్'లో కీలక పాత్రలో నటిస్తున్నాడు. డిసెంబరు 5న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.



## 7 పరుగులకే ఆలౌట్..

- **టీ20 క్రికెట్‌లో ఐవరీ కోస్ట్ చెత్త రికార్డు**


**బలగం టీవీ, న్యూఢిల్లీ**

అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఆఫ్రికా దేశం ఐవరీ కోస్ట్.. ఏడు పరుగులకే ఆలౌట్ అయి అత్యంత చెత్త రికార్డును మూటగట్టుకుంది. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ సబ్ రీజియన్ ఆఫ్రికా క్వాలిఫయర్స్‌లో భాగంగా నైజీరియాతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 7 రన్స్‌కే కుప్పకూలింది. మొదట బ్యాటింగ్ చేసిన నైజీరియా నిర్ణీత ఓవర్లలో 271/4 పరుగుల భారీ స్కోరు చేసింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన నైజీరియా తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 4 వికెట్లకు 271 పరుగులు చేసింది. నైజీరియా తరపున ఓపెనర్ సలీం సలావ్ 53 బంతుల్లో 112 పరుగులతో ఇన్నింగ్స్ ఆడాడు. కాగా, మిడిలార్డర్‌లో ఇసాక్ ఒపెక్ 23 బంతుల్లో 65 పరుగులు చేశాడు. ఫలితంగా ఈ జట్టు ఐవరీకోస్ట్ ముందు 272 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.అనంతరం ఐవరీ కోస్ట్ జట్టు బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు, దాని మొదటి 2 వికెట్లు 4 స్కోరు వద్ద పడిపోయాయి. ఆ తర్వాత మరో ఇద్దరు బ్యాటర్లు 5 పరుగుల వద్ద ఔటయ్యారు. 6 పరుగుల వద్ద ఐవరీకోస్ట్ 7.3 ఓవర్లలో 7 పరుగులకే ఆలౌట్ కాగా, మరో ముగ్గురు బ్యాట్స్‌మెన్ వికెట్లు కోల్పోయింది.

## గేయ రచయిత కులశేఖర్ కన్నుమూత..!

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలుగు సినీ ఇండస్ట్రీలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సినీ గేయ రచయిత కులశేఖర్ (54) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మంగళవారం ఉదయం కన్నుమూశారు. చిత్రం, నువ్వు-నేను, మనసంతా నువ్వే, ఔనన్నా కాదన్నా, ఘర్షణ, భద్ర, సంతోషం, జయం, సైనికుడు లాంటి సూపర్‌హిట్ చిత్రాలకు ఆయన పాటల రచయితగా పనిచేశారు.

అయితే వందకు పైగా సినిమాలకు స్టార్ రైటర్‌గా పనిచేసిన కుల శేఖర్ చెడు వ్యసనాలకు బానిసై కొన్నేళ్లుగా చిత్ర పరిశ్రమకు దూరమయ్యాడు. కుటుంబ సభ్యులతోనూ కూడా దూరంగా ఉన్నాడు. అవకాశాలు ఆగిపోవడంతో మానసికంగా కుంగిపోయి డబ్బుల కోసం దొంగతనాలు కూడా చేసాడు. కొన్ని సంవత్సరాల కిందటా ఒక దొంగతనం కేసులో కూడా అరెస్ట్ అయ్యి ఆరు నెలలు జైలులో ఉండి బయటికి వచ్చాడు. ఇక బయటికి వచ్చిన అనంతరం మానసికంగా చాలా కుంగిపోయారు. దీంతో అతడికి అనారోగ్య సమస్యలు రాగా.. చివరికి దయనీయ స్థితిలో మృత్యు ఒడికి చేరారు. ఇక కులశేఖర్ మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు ఆయనకు సంతాపం తెలియచేస్తున్నారు.

## విడాకులు తీసుకుంటే సెకండ్ హ్యాండ్ ట్యాగ్ తగిలిస్తుంటారు

**బలగం టీవీ, హైదరాబాద్**



విడాకులు తీసుకున్న అమ్మాయిలకు సెకండ్ హ్యాండ్, యూజ్డ్, ఆమె జీవితం వేస్ట్ వంటి ట్యాగ్స్ తగిలిస్తుంటారని... ఇలాంటి ట్యాగ్స్ ఎందుకు తగిలిస్తారో తనకు అర్థం కాదని సమంత అన్నారు. ఇలాంటి మాటలు ఆ అమ్మాయిని, ఆమె కుటుంబ సభ్యులను ఎంతో బాధ పెడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సమంత మాట్లాడుతూ.. పెళ్లైన నాలుగేళ్లకే చైతన్యతో విడాకులు తీసుకున్న తర్వాత నేను ఎన్నో తీవ్రమైన ట్రోలింగ్స్‌ను ఎదుర్కొన్నా. నన్ను కొందరు 'సెకండ్ హ్యాండ్' అని కామెంట్ చేశారు. నాపై చాలా రూమర్స్ వచ్చాయి. అవన్నీ నిజం కాదని చాలా సార్లు బయటకు వచ్చి చెప్పాలని అనిపించింది. కానీ చెప్పడం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదని ఆగిపోయాను' అని చెప్పింది. ట్రోల్స్‌ను తట్టుకుని తాను నిలబడ్డానని తెలిపారు. కష్ట సమయంలో తనకు స్నేహితులు, కుటుంబ సభ్యులు అండగా నిలిచారని చెప్పారు. ఒక జంట విడాకులు తీసుకుంటే తప్పు ఎవరిదైనా అమ్మాయిదే తప్పు అని నిందిస్తున్నారని అన్నారు. ఇలాంటి సమాజంలో మనం బతుకుతున్నామన్నారు. ప్రస్తుతం తాను చాలా సంతోషంగా ఉన్నానని అన్నారు.